ప్రజాశక్తి
గురువారం 30 మార్చి 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

'కేబుల్' చర్చలు కొలిక్కి

- చెరి 50 శాతం సర్దుబాటుకు అంగీకారం?
- ఏడాదికి రూ.72 కోట్ల టర్నోవర్
- ఫలించిన వైసిపి ప్రయత్నాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు నగరంలో ఆరు రోజులుగా కేబుల్ ప్రసారాలు నిలిచాయి. సిటీకేబుల్‌కు ఇతర నెట్‌వర్కులు నడుపుతున్న యాజమాన్యాలకు మధ్య బుధవారం జరిగిన అంతర్గత చర్చలు కొలిక్కి వచ్చాయి. వైసిపి ప్రజాప్రతినిధులు కేబుల్ వ్యాపారంలో దూసుకుపోవాలని తలంపుతో విద్యుత్ శాఖ అధికారుల ద్వారా స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగింప చేసి సిటీకేబుల్ యాజమాన్యాన్ని లొంగదీసుకోగలిగారు. సిటీ కేబుల్ యాజమాన్యం గత ప్రభుత్వ హయాంలో గుంటూరు సహా వివిధ పట్టణాల్లో అప్పట్లో ఉన్న కేబుల్ ఆపరేటర్లను తొలగించి వారిపై పోలీసు కేసులు పెట్టించి తన గుత్తాధిపత్యాన్ని పెంచుకున్న రీతిలోనే వైసిపి నేతలు కూడా సిటీకేబుల్‌కు ఉన్న 2 లక్షల కనెక్షన్లలో 50 శాతం నెక్ట్స్ కేబుల్ నెట్ వర్కుకు అప్పగించేలా ఒప్పందం జరిగినట్టు తెలిసింది. నెక్ట్స్ కేబుల్ నెట్ వర్కు బాధ్యతలను ప్రస్తుతం వైసిపి నాయకులు, డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు చూస్తున్నారు. ఆయనతో కలిసి రాష్ట్ర మంత్రి, గుంటూరులోని ప్రజా ప్రతినిధులు కలిసి సిటీ కేబుల్ కనెక్షన్లను సగం మార్పు జరిగిలే వ్యూహరచన చేశారు. ప్రసారాలు నిలిచిపోవడంతో గుంటూరులోని వివిధ ప్రాంతాల్లో సిటీ కేబుల్ కనెక్షన్ల స్థానంలో తమ కనెక్షన్లు తీసుకునేలా వినియోగదారులకు పలు ఆఫర్లు ఇచ్చి తిరిగి కనెక్షన్లు పునరుద్ధరిస్తున్నారు.

నగరంలో రెండు లక్షల కనెక్షన్ల ద్వారా ఏడాదికి రూ.70 కోట్లకు పైగా టర్నోవర్ జరుగుతుండటంతో ఈ వ్యాపారంపై వైసిపి నేతల కన్ను పడింది. కేబుల్ రంగంలో ఒక్కసారి లైన్లు ఏర్పాటు చేసుకుంటే ప్రతినెలా ఆదాయం వస్తుంది. ట్రాయ్ నిబంధనల ప్రకారం కేబుల్ ప్రసారాలకు 100 ఛానల్స్‌ను ఉచితంగా ఇవ్వాలనే నిబంధన కూడా అమలు కావడం లేదు. ఎవరి ఇష్టానుసారం వారు వసూలు చేసుకుంటున్నారు. కనిష్టంగా ఒక్కో కనెక్షను నుంచి రూ.300 వసూలు చేస్తున్నారు. అయితే తమకు ఉన్న అధికారం ద్వారా విద్యుత్ స్తంభాలకు ఉన్న సిటీకేబుల్ వైర్లను తొలగించేందుకు వీలుగా అధికారులతో వైర్లు కత్తిరింపచేసిన వైసిపి నేతలు తిరిగి అవే స్తంభాలకు కొత్త వైర్లు అమర్చి వారి నెట్‌వర్కు కనెక్షన్లు ఇస్తున్నారు. చర్చలు ఫలవంతం



కేబుల ఆపరేటర్లతో సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాజకుమారి

కేబుల్ వైర్లు తొలగింపుపై జేసీ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ స్తంబాలపై ఉన్న కేబుల్ వైర్లు తొలగింపుపై విద్యుత్ శాఖాధికారులు, కేబుల్ ఆపరేటర్లతో జెసి జి.రాజకుమారి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో జెసి మాట్లాడుతూ విద్యుత్ స్తంబాలపై కేబుల్ వైర్లు ఏర్పాటుకు అనుమతుల మంజూరుపై విధివిధానాలను రూపొందించేందుకు జిల్లా స్థాయిలో విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖ, కేబుల్ ఆపరేటర్ అసోషియేషన్ ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యుత్ శాఖ నిబంధనలు, కేబుల్ రెగ్యులెటరీ యాక్ట్‌లోని నిబంధనలను పరిశీలించి కమిటీ విద్యుత్ స్తంబాలపై కేబుల్‌వైర్లు, ఇంటర్నెట్ వైర్లు ఏర్పాటుకు సంబంధించి అనుమతులపై మార్గదర్శకాలను రూపొందిస్తుందని అన్నారు. ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ స్తంబాలపై ఉన్న కేబుల్ వైర్లు తొలగింపు సంఘటన పునరావతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేబుల్ వైర్లు ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల అమలుకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ స్తంబాలపై వైర్లను ఉద్దేశపూర్వకంగానే తొలగించారని కేబుల్ ఆపరేటర్లు చెబుతున్న అంశంపై విచారణ చేస్తామని తెలిపారు. సమావేశంలో సిపిడిసిఎల్ ఎస్ఇ మురళీకృష్ణ యాదవ్, ఆర్‌డిఒ ప్రభాకరరెడ్డి, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ కేబుల్ ఆపరేటర్ల డివిజన్ రాష్ట్ర అధ్యక్షులు అన్నపరెడ్డి విజయ భాస్కరరెడ్డి, కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

1న విశాఖ ఉక్కు పోరాట సంఘీభావ ప్రదర్శన

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట సమితి జిల్లా కమిటీ పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించి 700 రోజులవుతున్న సందర్భంగా, విశాఖ ఉక్కు పోరాటానికి సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా 1వ తేదీన స్థానిక శంకర్ విలాస్ సెంటర్ నుండి లాడ్జి సెంటర్ వరకూ జరిగే సంఘీబావ ప్రదర్శనలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట సమితి గుంటూరు జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. బుధవారం బ్రాడీపేట, సిఐటియు నగర కార్యాలయంలో ఐఎఫ్‌టియు నాయకులు కృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ఎఐటియుసి జిల్లా కన్వీనర్ ఎం.హనుమంతరావు, సిఐటియు నగర తూర్పు, పశ్చిమ ప్రధాన కార్యదర్శులు కట్లకుంట శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, సిఐటియు నాయకులు ఆది నికల్సన్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.నాసర్‌జి, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట సమితి ఆధ్వర్యంలో గత 700 రోజులుగా స్ఫూర్తిదాయకమైన ఉద్యమం నిర్వహిస్తున్నారన్నారు. కేంద్రం ప్రైవేటీకరణవైపు ఒక్క అడుగు కూడా ముందుకు వేయకుండా నిలువరించగలిగామని, అదే స్ఫూర్తితో ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే విధంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు, ప్రజలు, వివిధ ప్రజా సంఘాలు భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఏప్రిల్ 1న జరిగే ప్రదర్శనలో కార్మికులు, యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రేమజంట ఆత్మహత్య





ప్రేమకు పెద్దల అంగీకారం లేకపోవడంతో రైతుకింద పడి మృతి

మృతులు త్రివేణి, శ్రీకాంత్ (ఫైల్)

మెయిన్‌లో



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పాశం రామారావు తదితరులు

దేశానికి పట్టిన పీడ ఆదాని చీడ

పుస్తకావిష్కరణలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

2లో

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

- పల్నాడు జిల్లాలో హాజరుకానున్న 24,354 మంది విద్యార్థులు
- 127 కేంద్రాల్లో నిర్వహణ
- అధికారులతో కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-నరసరావుపేట

పదోతరగతి విద్యార్థులకు 3-18 తేదీల్లో జరగనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు పల్నాడు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ చెప్పారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, డిఇఒలతో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో కలెక్టర్‌తోపాటు, డిఇఒ శామ్యూల్, డిఆర్‌ఒ వినాయకం, ఇతర అధికారులు కలెక్టరేట్ నుండి వర్చువల్‌గా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఆవిర్భాం తర్వాత తొలి పరీక్షలైన దృష్ట్యా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 127 పరీక్ష కేంద్రాల్లో 24,354 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, ప్రశ్నాపత్రాలకు తొలిసారిగా సీరియల్ నంబర్లను కేటాయిస్తారని చెప్పారు. పరీక్షలు మొత్తం 8 రోజులు జరుగుతాయని, ప్రతి రోజూ ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుందని అన్నారు.


అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న పల్నాడు కలెక్టర్ శివశంకర్

ఎల్ఐసి ఆఫీసు వద్ద పెన్షనర్ల నిరసన

8లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం సాయంత్రం) : 6.25

సహరీ (శుక్రవారం ఉదయం) : 4.47



చలోఢిల్లీ కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం 5వ తేదీన నిర్వహించే చలోఢిల్లీ కార్యక్రమానికి ప్రజానీకమంతా తరలిరావాలని సిఐటియు సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి ఎం.హరిపోతురాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ ప్రాంతంలో కరపత్రాలతో ప్రచారం చేశారు. డివైఎఫ్ఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కార్యదర్శి జె.రాజ్‌కుమార్, ఐద్వా నాయకులు తుమ్మల లక్ష్మి, కెవిపిఎస్ నాయకులు చింతపల్లి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పెద్ద మొత్తంలో పట్టుబడిన గంజాయి

ప్రజాశక్తి - తెనాలి

పోలీసులు పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకున్నారు. స్థానిక ఐతానగర్ పాడిసన్పేట కమ్యూనిటీ హాల్ వద్ద పట్టణానికి చెందిన ఐలా శ్రీనివాస్‌ఆ, తనితో పాటు మరో ఐదుగురు గంజాయి ముఠాను టూ టౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పద్నాలుగున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి బృందంలో ఇద్దరు నందులపేటకు చెందిన వారు కాగా, నలుగురు ఐతానగర్‌కు చెందినవారేనని పోలీసులు తెలిపారు. కొనుగోలు చేసిన గంజాయిని విక్రయించేందుకు చిన్నచిన్న పొట్లాలుగా తయారు చేస్తున్న క్రమంలో పోలీసులకు సమాచారం అందింది. వెంటనే దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

ఓవర్ లోడ్ లారీలకు జరిమానా

ప్రజాశక్తి - తెనాలి

పరిమితికి మించిన లోటుతో వెళుతున్న లారీలను గుర్తించి న స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు అపరాధరసం విధించారు. ఎస్ఈబి ఇన్స్పెక్టర్ ఏవి చలం ఆధ్వర్యంలో బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కొలకలూరు వద్ద లారీలను పరిశీలించి, పరిమితికి మించిన లోడు ఉన్నందున ఒక లారీకి రూ.8వేలు, మరోలారికి రూ.4 వేలు చొప్పున అపరాధరసం విధించారు.

ఒకటో తేదీన పాత సామాన్లకు వేలం

ప్రజాశక్తి-నరసరావుపేట : పురపాలక సంఘానికి చెందిన పాత వాహనాలు, ఇతర వస్తువులకు వేలం నిర్వహిస్తామని ఇన్‌చార్జి కమిషనర్ డి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టిబి గెస్ట్‌హౌస్‌లోని పాత ఇనుము, పాత ఆటోలు-4, ట్యాంకర్లు - 2, ట్రాలీ-2, శాంతినగర్ వద్దగల సిఐ మెటీరియల్స్, ఇనప సామాను, మున్సిపల్ కార్యాలయం వద్దన పాత సీలింగ్ ఫ్యాన్లు, లైటింగ్ సెట్లు, పాత ఇనుప బీరువాలు, పారిశుధ్య విభాగానికి చెందిన పాత టైర్లు తదితరాలకు మున్సిపల్ కార్యాలయంలో ఒకటో తేదీ అయిన శనివారం ఉదయం 11 గంటలకు వేలం ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.లక్ష ధరావత్‌ను డ్రాఫ్టు లేదా చెక్ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

'కేబుల్' చర్చలు కొలిక్కి

(మొదటి పేజీ తరువాయి)

కావడంతో స్తంభాలకు తిరిగి వైర్లు ఏర్పాటు చేసుకునేందుకు సిటీ కేబుల్ వారికి కూడా అవకాశం దక్కింది. గుంటూరుకు 15 కిలో మీటర్ల పరిధిలో సిటీ కేబుల్ కనెక్షన్ దారులకు కేబుల్ ప్రసారాలు నిలిపివేయడంపై ప్రజలకు ఏర్పడిన అసౌకర్యంపై జిల్లా అధికారులు బుధవారం స్పందించారు. ఏకపక్షంగా కేబుల్ వైర్లు తొలగింపు సరికాదని, దీనిపై విచారణ చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి తెలిపారు.

దేశానికి పట్టిన పీడ ఆదాని చీడ

పుస్తకావిష్కరణలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

దేశ సంపదను దోచేస్తున్న ఆదాని పీడ నుంచి కాపాడుకునేందుకు అందరూ ముందుకు రావాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. రాజధానికి ముఖద్వారమైన ఉండవల్లి సిపిఎం కార్యాలయంలో దేశానికి ఆదాని ముప్పు అనే పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వనరులైన భూమి, నీరు, గాలి, అడవులు, గనులు తదితర ప్రతీది ఆదానీపరం చేస్తున్నారని మోడీ ప్రభహుత్వ తీరును విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ మద్దతుతో ఇక్కడ కూడా నిలువునా దోచుకోవడానికి ఉరుకులు పరుగులు పెడుతున్నారని విమర్శించారు. గతంలో విదేశీ దురాక్రమణదారులను చూస్తే ఇప్పుడు ఏకంగా స్వదేశీ దురాక్రమణదారులను చూస్తున్నామని మండిపడ్డారు. మోడీ దన్నుతో ఆదానీ దేశంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. సోలార్ విద్యుత్ పేరుతో వేలాది ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వం ఆదానీకి కట్టబెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం మోడీ, ఆదానీ ముప్పు నుంచి రాష్ట్రం, దేశాన్ని రక్షించుకోవడానికి ప్రజలు కదలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాజధాని కమిటీ కార్యదర్శి ఎం.రవి, ఎం.భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ మాఫియా నానికి బుద్ధి చెబుతాం : వైసిపి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో ప్రైవేటు సెటిల్‌మెంట్స్, భూ మాఫియాలకు మారుపేరు కార్పొరేటర్ కోవెలమూడి రవీంద్ర (నాని) అని వైసిపి కార్పొరేటర్లు విమర్శించారు. ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌ను నాని విమర్శించడాన్ని ఖండిస్తూ వారు బుధవారం ఎమ్మెల్యే గిరిధర్ కార్యాలయంలో కార్పొరేటర్లు బూసిరాజలత, ఈచంపాటి ఆచారి, నిమ్మాల వెంకట రమణ, తేలుకుట్ల యోగేశ్వర రావు , కంద్రుగుంట గురవయ్య, సాధు ఉమా మహేశ్వరి-రాజేష్ , అడకా పద్మావతి, షేక్ రోషన్ అచ్చాల వెంకట్ రెడ్డి అందుగుల సంతోష్ గారు, గోపి శ్రీనివాస రావు, బుసి రాజలత, షేక్ జూమ్మభి, యక్కలమారుతీ, బోడపాటి ఉషారాణి, మల్లిబోయిన శ్రీవల్లి తదితరులు మాట్లాడారు. మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో కూడా నాని డివిజన్‌లో రూ.3 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో యుజిడి పనుల పేరుతో అప్పటి టిడిపి నాయకులు అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. రోడ్లనీ ధ్వంసం చేశారని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత పశ్చిమ నియోజకవర్గంలో రూ.80 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వైసిపి నుంచి 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసినప్పుడు నైతిక విలువలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కోవెలమూడి రవీంద్ర మరోసారి తమ పార్టీపై విమర్శిస్తే తగిన బుద్ధిచెబుతాం అన్నారు. వైసిపి నాయకులు టిఎల్‌వి వీరాంజనేయులు, ఆనం సంజీవరెడ్డి, బోగిసం ప్రసాద్, మందాల కోటిరెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకేరోజు రూ.54 లక్షల పన్ను వసూలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి



ఆస్తి పన్ను మొండి బకాయిలపై మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ దృష్టి సారించారు. బుధవారం ఒకేరోజు రూ.54 లక్షల పన్ను వసూలు చేశారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయానికి సంబంధించి ట్యాక్స్ 2002 నుండి 2003 సంవత్సరం నుండి పెండిగు ఉంది. దీనిపై మునిసిపల్ కమిషనర్ కెషమ్మి ప్రత్యేక చొరవ తీసుకొని అటు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు, ఇటు వైపు కోర్టు కార్యాలయం వారితో,జిల్లా మునిసిపల్ ప్రత్యేక అధికారులతో నిత్యం పలుమార్లు కలిసి మొత్తం రూ.1.38 కోట్లకుగాను ప్రభుత్వం వడ్డీ మాఫీ అవకాశం ప్రకారం 84 లక్షలు పోగా మిగిలిన రూ.54 లక్షలు రూపాయలు రావాలని మంగళవారం నాడు వారికి తెలిపారు. బుధవారం నాడు పట్టణ ఫుడ్ కార్పొరేషన్ అధికారులు మునిసిపల్ కార్యాలయంలో ఛైర్పర్సన్ ఛాంబర్లో, రావాల్సిన రూ.54 లక్షల రూపాయలు డీడీ ను కమిషనర్ షమ్మి కులి అందచేశారు. కమిషనర్‌ను చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మి తులసి సాంబశివరావు ప్రత్యేకంగా అభినందించారు. మరో బకాయి సెంట్రల్ వేర్ హౌసింగ్ నుండి రావాల్సిన రూ.18 లక్షల రూపాయలు కూడ వారితో మాట్లాడగా నేడు కట్టారని తెలిపిన కమిషనర్ మునిసిపాల్టీకి మొత్తంగా ఈ రెండు రోజుల నుండి రూ.84 లక్షల పన్ను వచ్చిందన్నారు.

రహదారుల భద్రతకు సమగ్ర చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లాలో రహదారుల భద్రతకు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లోని ఎస్.ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలులో రహదారి భద్రత సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. 2023 ఏప్రిల్ 1 నుండి 15 సంవత్సరాల కాలపరిమితి ముగిసిన ప్రభుత్వ వాహనాలు మరియు ప్రభుత్వ రంగ సంస్థల వాహనాల రిజిస్ట్రేషన్ ను రద్దు చేస్తున్నామని ఆ వాహనాలు రహదారుల పై తిరగడానికి వీలులేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మోటారు వాహనాల చట్టం 52ఏ ని అమల్లోకి తెచ్చిందన్నారు. 52ఏ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం వాహనాలు, రాష్ట్ర ప్రభుత్వ వాహనాలు, మున్సిపల్ కార్పొరేషన్ వాహనాలు, ఆర్టీసీ వాహనాలు మరియు పంచాయతీ లకు సంబంధించిన వాహనాలలో 15 సంవత్సరాల కాల పరిమితి ముగుస్తుందో ఆ వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేయాలన్నారు. ప్రమాదాల నివేదిక ఆధారంగా తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు,ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు. గుర్తించిన బ్లాక్ స్పాట్లలో సంబంధిత విభాగ అధికారులు ప్రమాదాల నివారణకు పోలీసు, రవాణా, రహదారులు మరియు భవనాల శాఖ , జాతీయ రహదారులు మరియు ఆరోగ్య శాఖలు సమన్వయం తో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. చాలా ప్రదేశాలలో రహదారుల పక్కన సరైన సూచిక గుర్తులు, బోర్డు లు లేకపోవడం వలన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి టి. కె. పరందమరెడ్డి ప్రస్తావించగా ప్రమాదాల నివారణకు సరైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఓవర్ బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి - నరసరావుపేట



పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో చిలకలూరిపేట రోడ్డులో ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి మధ్యలో ఇనుప రాడ్లు విరిగిపోవడంతో ప్రమాద భరితంగా మారిందని వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ఎంసిపిఐ (యు) పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బ్రిడ్జి పైన బుధవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మొహిద్దిన్‌బాష మాట్లాడుతూ వందల ఏళ్ల క్రితం కట్టించిన భవనాలు ఇప్పటికీ చెక్కు చెదరలేదని 10 ఏళ్ల క్రితం కట్టించిన ఓవర్ బ్రిడ్జిపై ఇనుప చువ్వలు పైకి లేవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల జరిగిన ప్రమాదాలు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాణ్యత లోపం వలన బ్రిడ్జికి రంధ్రం పడి అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉందన్నారు. 48 గంటలలో మరమ్మతులు పూర్తి కోరుతూ ఆర్ అండ్ బి ఇఇ రాజానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు హుందా శ్యాంప్రసాద్, షేక్ మహబూబ్ బాషా, బండారు కోటేశ్వరరావు పాల్గొన్నారు.



కలెక్టర్, ఎమ్మెల్యేను కలిసిన జడ్జి వెంకటసాయి హరీష్‌బాబు

ప్రజాశక్తి-నరసరావుపేట

నకరికల్లుకు చెందిన యువకుడు కొమ్మవరపు వెంకట సాయి హరీష్ బాబు తెలంగాణ జూనియర్ సివిల్ జడ్జి నియమితులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కొమ్మవరపు వెంకట సాయి హరీష్‌బాబు బుధవారం జిల్లా కలెక్టర్ శివశంకర్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు కలెక్టర్, ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్జి వెంకట సాయిహరీష్ బాబు తండ్రి లింగంగుంట్ల గ్రామ పంచాయితీ కార్యదర్శి కెవి.ప్రసాద్, తమ్ముడు మోహన కృష్ణ పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ధర్నా

ప్రజాశక్తి-రొంపిచర్ల

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలంటూ బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట మండల రజక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఎస్‌సి, ఎస్టీ, బిసి, ముస్లిం, మైనారిటీ ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు పొనుగుపాటి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ దేశంలో 18 రాష్ట్రాలలో, 3 కేంద్రపాలిత ప్రాంతములలో రజకుల ఎస్సీ జాబితాలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో బిసి జాబితాలో ఉన్నారని అన్నారు. గ్రామాలలో రజకులు నేటికీ వివక్షతకు గురవుతున్నారని అన్నారు. రజక మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని అన్నారు. రజకుల ఎస్సీ జాబితాలో చేర్చేంత వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని అన్నారు. అనంతరం తహసీల్దార్ జి.అంకారావుకు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల రజక సంఘం అధ్యక్షుడు పిడెం హుస్సేన్, మండల నాయకులు ఫణిదపు బోస్, పేరేచర్ల కోటేశ్వరరావు, పోట్లూరి బుజ్జి, కోటేశ్వరరావు, కొండలు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నిడమర్రు పంట పొలాల్లో ఎండుమిర్చి టిక్కీలు మాయం

రైతులు అడ్డుకోవడంతో ద్విచక్ర వాహనం వదిలి పారిపోయిన దుండగులు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

చోరీలకు కాదేదీ అనర్హం అన్న చందంగా కొందరు దుండగులు చివరకు పంట పొలాల్లో ఎండు మిర్చి టిక్కీలను సైతం వదలడం లేదు. ఆరుగాలం చెమటోడ్చి పండించిన మిర్చిని కల్లాల్లో ఆరబెట్టుకుంటున్న అన్నదాతల రెక్కలు కష్టాన్ని గత కొంతకాలంగా గుర్తు తెలియని దుండగులు తరచూ దోచుకుంటూనే ఉన్నారు. అయినా రైతులు ఏనాడూ పోలీసులకు ఫిర్యాదు చేయకుండా మిన్నకుండిపోయారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకున్న దుండగులు రోజు రోజుకూ మరింత రెచ్చిపోతున్నారు. తాజాగా మంగళవారం రాత్రి ఐదుగురు గుర్తు తెలియని దుండగులు నిడమర్రు పంట పొలాలకు ద్విచక్ర వాహనాలపై వచ్చి తాడిబోయిన మోహనరావు అనే రైతు తనకల్లంలో ఆరబెట్టుకున్న మిర్చిని గోతాల్లో నింపుకుని బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. ఇంటి వద్ద భోజనం ముగించుకుని అప్పుడే పంట పొలంలోని తన కల్లానికి వచ్చిన మోహనరావు తోటి రైతులతో కలిసి దుండగులను అడ్డుకునే ప్రయత్నించాడు. అప్పటికే నలుగురు దుండగులు నాలుగు మిర్చి టిక్కీలను ద్విచక్ర వాహనంపై పెట్టుకుని పారిపోగా ఓ దుండగుడు కంగారులో తన ద్విచక్ర వాహనం (AP39 EL 4612) అక్కడే వదిలి పారిపోయాడు. రాత్రివేళ చీకట్లో రైతులు వెంబడించినా ఫలితం లేకుండా పోయింది. మిర్చీ టిక్కీల చోరికి పాల్పడిన వారిపై మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు.



దుండుగులు వదిలి వెళ్లిన బైకు



వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన తహాశీల్ధార్

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరులో వివాదాస్పదంగా మారిన ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని తహసిల్దార్ ఆర్ వెంకటేశ్వర్లు నాయక్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ సర్వే నిర్వహించి ఆర్టీసీ బస్టాండ్ స్థలానికి హద్దులు నిర్ణయిస్తామని తెలిపారు. సర్వే నెంబర్ 81లో ప్రభుత్వ స్థలంలో ఒక ఎకరాన్ని ఆర్టీసీ బస్టాండ్‌కు కేటాయించారు. అయితే గ్రామస్తులు బస్టాండ్ లోపలకి బస్సులు వెళ్లే రహదారి పక్కనే శివుడి విగ్రహం ఏర్పాటుకు గుంతలు తీసి పనులు ప్రారంభించిన క్రమంలో డిపో మేనేజర్ కోటేశ్వరరావు నాయక్ గ్రామానికి చెందిన పలువురుపై రెవెన్యూ అధికారులకు, పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

వీధి కుక్కల దాడిలో 30 జీవాలు మృతి

రెండున్నర లక్షలు నష్టం

ప్రజాశక్తి-ముప్పాళ్ల : వీధి కుక్కల దాడిలో సుమారు 30 వరకు మూగజీవాలు మృతి చెందిన ఘటన మండలంలోని మాదలలో గ్రామంలో బుధవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చిమటా వెంకటరావుకు చెందిన మూగ జీవాలు తన ఇంటి వద్దే ఉన్న పాకలో ఉండగా తెల్లవారుజామున జీవాల అరుపులు వినబడడంతో వెంకటరావు లేచి చూడగా విధీ కుక్కల గుంపు దాడి చేస్తు కనిపించాయి. వెంటనే తెరుకుని వెంకటరావు కుక్కలను తరమగా అప్పటికే కుక్కల దాడిలో 30 జీవాల వరకు మృతి చెందగా, మరికొన్నింటికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న మాదల వెటర్నరీ డాక్టర్ ఎమ్.పుల్లారెడ్డి తమ వైద్య సిబ్బందితో గాయాలైనా వాటికి చికిత్స అందజేశారు. సుమారు 2.50 లక్షల వరకు నష్టం వాటిల్లిందని మూగ జీవాల పోషకుడు వెంకటరావు వాపోయాడు.

ఏడుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-నకరికల్లు

చేజర్ల గ్రామంలో పేకాడుతున్న ఏడుగురిని అదుపులో తీసుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం చేజర్ల గ్రామంలోని ఇటుక బట్టీల సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి వారి వద్ద నుండి రూ. 41,200 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆక్రమణకు గురైన మెగా టూరిజం భూముల పరిశీలన

ప్రజాశక్తి - విజయపురి సౌత్

ఇటీవల నాగార్జున సాగర్ పరిసర ప్రాంతాల్లో భూ ఆక్రమణలు ఎక్కువడంతో మెగాటూరిజం కోసం ఇచ్చిన భూములను రెవెన్యూ, టూరిజం అధికారులు కలిసి బుధవారం పరిశీలించారు. టూరిజం భూములు ఆక్రమణలకు గురికాకుండా ఉండేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో మెగాటూరిజం కోసం ఇచ్చిన 250 ఎకరాల భూములకు కంచె ఏర్పాటు చేసుకోవాలని పర్యాటక శాఖ నిర్ణయించింది. దీనితో రెవెన్యూ అధికారులను కలిసి 250 ఎకరాలకు సంబంధించిన హద్దులను సూచించాలని కోరారు. మండల ఆర్ ఐ ఫణీంద్ర ఆధ్వర్యంలో రెవెన్యూ బృందం మెగాటూరిజం భూములను పరిశీలించి, నివేదికను సిద్ధం చేశారు. కార్యక్రమంలో టూరిజం మేనేజర్ శ్రీనివాస్, మండల సర్వేయర్ పవన్ శర్మ, విఆర్ఓ లు శ్రీను, విగ్నేష్, టూరిజం ఉద్యోగులు వీరారెడ్డి, దత్తు పాల్గొన్నారు.





టెన్త్ క్లాస్ సర్టిఫికెట్ పోయినది

గుంటూరుజిల్లా, పెదనందిపాడు మండలం, పెదనందిపాడు గ్రామ నివాసి మాకినేని మమత, తండ్రి : శ్రీనివాస్‌కు చెందిన మార్చ్ 2016 రోల్ నెం.1614139467 రు గల టెన్త్ క్లాస్ ఒరిజినల్ సర్టిఫికెట్ గుంటూరు టౌన్ నుండి పెదనందిపాడుకు బస్సులో ప్రయాణిస్తుండగా పోయినది. దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లకు తెలియజేయగలరు.


సెల్ : 9391376230, 9849505310

ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి..

ప్రజాశక్తి- మేడికొండూరు

ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణం బలిగొన్న సంఘటన మండల పరిధిలోని పేరేచర్ల ఆరో మైలు వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగింది. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన షేక్ ముసుబ్ (23) ఫ్రిజ్‌లు కూలర్లు రిపేర్ పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. రోజు మాదిరిగా పేరేచర్లలో ఏసీ రిపేరు చేసుకుని తిరుగు బ్రాహ్మణపల్లి వెళుచుండగా మధ్యలో పేరేచర్ల 6మైలు కైలాసగిరి సమీపంలో డస్ట్ లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ద్విచక్రవాహాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో ముసుబు కింద పడిపోగా ట్రాక్టర్ ముసుబ్ ఒంటిపై నుండి వెళ్లిపోయినది. తీవ్ర గాయాలు పాలైన ముసుబ్బును మేడికొండూరు ఎస్సై కే.కోటేశ్వరరావు 108 అంబులెన్స్ సహాయంతో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ముసుబు మరణించినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. ముసుబుకు తల్లిదండ్రులు, భార్య ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటేశ్వరావు తెలిపారు.





మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న విద్యుత్ డిఇ హరిబాబు

రైతులు రూ.60 కోట్ల బాకీ : విద్యుత్ డిఇ

ప్రజాశక్తి - మాచర్ల

వ్యవసాయ పంపు సెట్లు ఉన్న రైతులు ప్రతినెలా రూ.30 చొప్పున కష్టమర్ ఛార్జీలు చెల్లించాలని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజినీర్ హరిబాబు చెప్పారు. డివిజన్ పరిధిలో రూ.6 కోట్ల కష్టమర్ ఛార్జీల బకాయి ఉన్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా విద్యుత్ శాఖకు మున్సిపల్ కార్యాలయం రూ.1.39 కోట్ల బకాయి ఉందని తెలిపారు. వీటిని చెల్లించాలని కోరుతూ ఆయన కమిషనర్ ఇవి రమణబాబును బుధవారం కలిశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో బకాయిలను చెల్లించాలని కోరారు. అనంతరం పట్టణ పరిధిలో డ్యామేజి పోల్స్ మార్పిడి చేయాలని డిఇని కమిషనర్ కోరారు. ఇరుశాఖల సిబ్బందితో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి అవసరమైన పోల్స్ మార్పిడికి నిర్ణయించారు. డంపింగ్ యార్డు ఏరియాలో, జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం గురించి, టిడ్కో ఇళ్ల ప్రాంతంలో విద్యుత్ సరఫరాపై చర్చించారు.

కోర్టు స్టే ఉన్నా మురికిపూడిలో ఆగని మైనింగ్

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మండలంలోని మురికిపూడిలో మైనింగ్‌పై హైకోర్టు స్టే ఉత్తర్వులిచ్చినా తవ్వకాలు మాత్రం కొనసాగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. కడప ఎంపీ అవినాష్‌రెడ్డి మామ ప్రతాపరెడ్డి క్వారీలో మైనింగ్ జరుగుతూనే ఉందని అంటున్నారు. దీనిపై గుంటూరు మైనింగ్ ఏడీని సమాధానం అడుగగా ఏమీ తెలియనట్లే మాట్లాడారని, విఆర్‌ఒను సంప్రదిస్తే తాము కలెక్టర్ కార్యాలయంలో ఉన్నట్లు చెప్పారని నీలం ఏసురాజు అనే రైతు చెప్పారు. దీనిపై తాము ఉద్యమిస్తామని, అన్ని ప్రజాసంఘాలనూ ఐక్యం చేసి పోరాడతామని చెప్పారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలతోపాటు ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులనూ సస్పెండ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన జారీ చేసినవారిలో సుంకర ఆనంద్‌బాబు, వలివేరు మార్గదర్శి, వలివేరు రతన్‌రాజు, కట్ట జాన్, కొర్నేలి దయారత్నం, కిషోర్‌బాబు, దాసిరత్నం ఉన్నారు.

సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా లింగారెడ్డి మరోసారి ఏకగ్రీవం

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్



సత్తెపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా మారూరి లింగారెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నిర్వహించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా ఉపాధ్యక్షులుగా చిన్నం మణిరావు, సెక్రెటరీగా సంధిపోగు బాబురావు, జాయింట్ సెక్రెటరీగా పినపాటి భవాని, కోశాధికారిగా హరిమణికంఠ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఆకుల నాగార్జున, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఉడుముల విద్యాసాగర్‌రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు చిలుగా చంద్రశేఖర్, సయ్యద్ అబ్దుల్ రహీమ్ వెల్లడించారు. నూతన కార్యవర్గానికి న్యాయవాదులు, గుమస్తాలు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

చలోఢిల్లీ జయప్రదం కోసం ప్రచారం



సత్తెనపల్లి ప్రచారంలో మాట్లాడుతున్న ఆర్.పురుషోత్తం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

చలోఢిల్లీ జయప్రదం కోసం పట్టనంలోని గార్లపాడు బస్టాండ్ సెంటర్, గడియారస్తంబం సెంటల్లో బుధవారం ప్రచారం చేశారు. భవని నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎ.ప్రసాదరావు మాట్లాడారు. సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఆర్.పురుషోత్తం, ఎం.హరిపోతురాజు, నాయకులు షేక్ సైదులు, సాల్మన్‌రాజు, పి.శ్రీను, మరియదాసు, ఆదాం సాహెబ్, రామారావు, యలమంద పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

చలోఢిల్లీ జయప్రదం కోసం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని మాదలలో బుధవారం ప్రచారం చేశారు. సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం,రైతుసంఘం,కౌలు రైతు సంఘం రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఎం.వెంకటరెడ్డి, కె.సాంబశివరావు, జి.జాలయ్య, నాగమల్లేశ్వరరావు, సైదాఖాన్, టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 5వ తేదీన నిర్వహించే చలోఢిల్లీని జయప్రదం కోసం శుక్రవారం బైక్‌ర్యాలీ నిర్వహించనున్నట్లు సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిఐటియు, రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీ పండరిపురంలోని సిఐటియు కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు మొదలవుతుందని, ఎన్‌ఆర్‌టి సెంటర్, చౌత్రా సెంటర్, కళామందిర్ సెంటర్ మీదుగా సాగి ఎన్‌ఆర్‌టి సెంటర్ వద్ద ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలు జయప్రదం చేయాలని కోరారు.



ముప్పాళ్ల మండలం మాదలలో కరపత్రాల పంపిణీ

రోజును ఎలా గడపాలో ప్రణాళిక వేసుకోండి

- మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రొఫెసర్ బి.బాలకృష్ణ సూచన
- నరసరావుపేట జెఎన్‌టియులో 'మెక్సేల్-2కే23' సమ్మేళనం



సత్కారం పొందుదున్న అతిథులు

ప్రజాశక్తి-నరసరావుపేట

జెఎన్‌టియు నరసరావుపేట మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సాంకేతిక సమ్మేళనం 'మెక్సేల్-2కె 23'ను స్థానిక పల్నాడు రోడ్డులోని కళాశాలలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జెఎన్‌టియు కాకినాడ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యూయేషన్ ప్రొఫెసర్ బి.బాలకృష్ణ మాట్లాడుతూ జెఎన్‌టియు మెకానికల్ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థులు ప్రస్తుతం అనేక రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరారని, వారి స్ఫూర్తితో ప్రస్తుత విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించాలని చెప్పారు. ఎక్కువ సమయం స్మార్ట్ ఫోన్లతో వృథా చేసుకోవద్దని సూచించారు. ఇది ఆరోగ్యంతోపాటు మానవ సంబంధాలనూ దెబ్బతీస్తుందని చెప్పారు. రోజును ఎలా గడపాలో ప్రణాళిక రూపొందించుకొని, అందులో వృథా సమయాన్ని తగ్గించుకుంటూ లోటుపాట్లను సరిదిద్దుకోగలిగితే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. తల్లిదండ్రులు, పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాల, ఉపాధ్యాయులను ఎప్పుడు మరువకూడదని సూచించారు. ప్రిన్సిపాల్ పొఫెసర్ సిహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ రంగం చాలా వేగంగా మార్పు చెందుతోందని, దానికి అనుగుణంగా విద్యార్థులు డిజైన్ థింకింగ్ అలవరచుకోవాలని చెప్పారు. సాంకేతిక సదస్సుల్లో పాల్గొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమ్మేళనంలో భాగంగా ఎథికల్ హాకింగ్, అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీలపై వర్క్‌షాప్‌లు, వివిధ సాంకేతిక, సాంకేతికేతర అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ కళాశాలకు చెందిన సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఇన్ఫిగ్లోబ్ సోలుషన్స్ వ్యవస్థాపకులు శ్రీ చైతన్య విశిష్ట అతిథిగా హాజరవగా వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఐ.శ్రీఫణి సుష్మ, ఫాకల్టీ కో-ఆర్డినేటర్లు బాలాజీ నాయక్, డాక్టర్ జి.సులోచన, స్టూడెంట్ కో-ఆర్డినేటర్లు ఉజ్వల్ భరత్ , శంకర్ సూర్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.



నాగార్జున కొండను సందర్శించిన శ్రీలంక బృందం

ప్రజాశక్తి- విజయపురిసౌత్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను 32 మంది శ్రీలంక దేశస్తుల బృందం బుధవారం సందర్శించింది. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగసిరి లాంచీలో నాగార్జున కొండకు వెళ్లిన బృందం కొండలోని నాగార్జున కొండలోని మ్యూజియంలో ఉన్న బుద్ధిని ప్రతిమలు, మట్టి కుండలు, రాతి పనిముట్లు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, అశ్వమేథశాల, మహాస్తూపం, స్నానాల గట్టును సందర్శించింది.



విద్యార్థినులతో మాట్లాడుతున్న జిసిడిఒ రేవతి

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ప్రజాశక్తి-ఈపూరు

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పదో తరగతి విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు జిసిడిఒ డి.రేవతి చెప్పారు. మండల కేంద్రమైన ఈపూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలన అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో 24 కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలు ఉన్నాయని, వాటిల్లో 803 మంది పదో తరగతి విద్యార్థినులు ఉన్నారని చెప్పారు. వీరంతా పరీక్షలకు బాగా సిద్ధమయ్యారని, ఇద్దరు మాత్రమే వెనకబడ్డారని చెప్పారు. వారికీ ప్రత్యేక శిక్షణిచ్చి నూరుశాతం ఫలితాల సాధనకు కృషి చేస్తామని అన్నారు.

మాదలలో లేగదూడల ప్రదర్శన



ప్రజాశక్తి-ముప్పాళ

మండలంలోని మాదలలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి కె.కాంతారావు హాజరయ్యారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ లేగ దూడల పెంపకంలో జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, పోషణతోపాటు నట్టల నివారణ మందు టీకాల ప్రాముఖ్యత గురించి పాడిరైతులకు వివరించారు. ప్రదర్శనలో 79 లేగ దూడలు పాల్గొనగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన దూడలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ వైద్యులు డాక్టర్ ధనుంజయరెడ్డి, సత్తెనపల్లి సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, ఎంపిపి పద్మారామలింగారెడ్డి, ఉపసర్పంచ్ వై.సైదా, జి.కోటేశ్వరరావు, మాదల, ముప్పాళ్ల పశువైద్యులు పుల్లారెడ్డి, కరుణాకర్‌రెడ్డి,అంజిబాబు పాల్గొన్నారు.

ఉన్నవలో అధికారుల మార్నింగ్ వాక్

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని ఉన్నవలో తహశీల్దార్ ఎం.నాగమల్లేశ్వరరావు, ఇతర రెవెన్యూ అధికారులు బుధవారం మార్నింగ్ వాక్ పేరుతో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక వ్యర్థాల నిర్వహణ కేంద్రం వద్ద కాఫీ విత్ క్లాప్‌మిత్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణపై పరిశీలించారు.



క్లాప్ మిత్రలతో మాట్లాడుతున్న అధికారులు

ఇవిఎం గోడౌన్లను పరిశీలించిన డిఆర్ఓ


ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీలలో భాగంగా గుంటూరు ఆర్డీవో కార్యాలయం ఆవరణలోని ఇవియంలు భద్రపరిచిన గోడౌన్‌ను జిల్లా రెవిన్యూ అధికారి చంద్ర శేఖరరావు బుధవారం తనిఖీ చేశారు. రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్లకు వేసిన సీళ్ళు తొలగించి తాళాలు తీశారు. గోడౌన్ లోపల ఉన్న ఇవియంలను డిఆర్ఓ పరిశీలించారు. ఇవియం ల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం ఫిరంగిపురం మండలం రేపూడిలో వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లో భద్రపరచిన వీవీపాట్‌లను ఆర్‌డిఓ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ సాంబశివరావు, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు సిద్దార్ధ్, ఫిరంగిపురం తహశీల్దారు పద్మనాభుడు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తహీనత ఉన్న బాలికలపై నిరంతర పర్యవేక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో రక్తహీనత ఉన్న విద్యార్థులు, గర్భిణీ స్త్రీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోని పౌష్టికాహారం, వైద్య సేవలు సక్రమంగా అందేలా వైద్యాధికారులతో పాటు మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పది నుండి 19 ఏళ్ల వయస్సు ఉన్న బాలికలకు నూరు శాతం రక్తపరీక్షలు నిర్వహించాలన్నారు. రక్తహీనత ఎక్కువగా విద్యార్ధుల ఆరోగ్యాన్ని ఫ్యామిలీ డాక్టర్‌తోపాటు, విద్యాశాఖ అధికారులూ నిరంతరం పర్యవేక్షించాలన్నారు. తీవ్ర రక్తహీనత ఉన్న గర్భిణిలకు సుఖ ప్రసవాలు జరిగేలా నిరంతరం వైద్య సేవలు అందించాలన్నారు. బరువు తక్కువ, బలహీనంగా ఉన్న పిల్లలు నూరుశాతం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. గ్రామ వార్డు సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలు, పేదలందరికీ ఇళ్ళ పథకంలే అవుట్లలో ఇళ్ళ నిర్మాణాలు, ఇటీవల అకాల వర్షానికి నష్ట పోయిన పంటల వివరాలను నమోదు, రబీకి అవసరమైన విత్తనాలు, పురుగుమందులు తదితర అంశాలపై సమీక్షించారు.సమావేశంలో కలక్టరేట్ నుండి డిఆర్ఓ కె.చంద్రశేఖర్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.వెంకట శివరామిరెడ్డి, సిపిఓ శేషశ్రీ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఘనంగా పేరేచర్ల బాసర కాన్సెప్ట్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి- మేడికొండూరు



మండలంలోని పేరేచర్ల పేరేచర్ల బాసర కాన్సెప్ట్ స్కూల్ వార్షికోత్సవ వేడుక బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ డొక్క మాణిక్య వరప్రసాద్ తొలుత కార్యక్రమ ప్రారంభోత్సవ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతోపాటు ప్రత్యేకమైన సాంకేతిక నైపుణ్యతను రంగాలలో రాణించాలని అన్నారు. బాసర కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కొండపల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బాసర కాన్సెప్ట్ స్కూల్ డైరెక్టర్ సాధినేని మురళీమోహన్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి మంచి సముచిత స్థానం దరిచేరాలంటే ఒక విద్యతోనే సాధ్యమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను, నాటికలను ప్రదర్శిం చారు. కార్యక్రమంలో బాసర కాన్సెప్ట్ స్కూల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ సాదినేని రాధా, ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్ ,పేరేచర్ల గ్రామ సర్పంచ్ దేవరకొండ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెదకాకానిలో



మేడికొండూరులో



పెదనందిపాడులో

ఎప్రిల్ 5న చలో ఢిల్లీ జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విలేకర్లు

కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గుంటరు జిల్లాలో పలు గ్రామాల్లో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. పెదనందిపాడులో ఎపి రైతు, కౌలు రైతు, సిఐటియు, వ్యకాస ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, ఎం వెంకటేశ్వర్లు, రైతు ఐక్యవేదిక నాయకులు కుర్రా హరిబాబు ప్రసంగించారు. పెదకాకానీలో పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజి మాట్లాడారు. 9 ఏళ్ల బిజెపి పాలన వల్ల దేశంలో గ్యాస్ పెట్రోల్ డీజిల్ మందులు ఆహార పదార్థాలు నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. కార్మిక చట్టాల్లో మార్పు చేసి కార్పొరేట్ సంస్థలకు మేలు జరిగే లాగా చట్టాల్లో మార్పు చేశారని విమర్శించారు. ఇప్పటికే మోటార్ వాహనాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారీ మొత్తంలో పెట్రోల్ డీజిల్ గ్యాస్ ఇన్సూరెన్స్ ప్రీమియం రోడ్ టాక్స్ గ్రీన్ టాక్స్ టోల్ గేట్లు అన్ని రకాల ఫీజులు పెనాల్టీలు విపరీతంగా పెరిగి వాహనాలు నడపలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో 15 సంవత్సరాలు దాటిన వాహనాలు తుక్కు కింద మార్చాలనే నిర్ణయంతో రెండు కోట్ల మంది ఉపాధి కొలిపోయే ప్రమాదం ఉంది అన్నారు. కంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ చలో ఢిల్లీ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మంగళగిరి పట్టణంలోని పెనుమాక, ఎర్రబాలెం ఆటో స్టాండ్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్ చంగయ్య మాట్లాడుతు కార్మిక వ్యతిరేక విధానం అవలంబిస్తున్న మోడీ ప్రభుత్వం విధానాలపై జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వై కమలాకర్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. మేడికొండూరు మండలం సిరిపురం గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారంలో కౌలు రైతు సంఘం నాయకులు బి రామకృష్ణ, సిపిఎం నాయకులు కొండే పోగు వెంకటరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బురదగుంట సాంబయ్య, ఆర్ వెంకటేశ్వర్లు, కె రాఘవయ్య, ఏ నాగేశ్వరావు , జెట్టి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మంగళగరిలో

మద్దాలి గిరిధర్ రాజీనామా చేయాలి

టిడిపి కార్పొరేటర్ల డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :ఎమ్మెల్యే మద్దాలి గిరికి నైతిక విలువలు ఉంటే తన పదవికి రాజీనామా చేసి తిరిగి వైసిపి నుంచి గెలవాలని టిడిపి కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరావు, పోతురాజు సమతా, మానం పద్మశ్రీ, ముప్పవరపు భారతి, నుకావరపు బాలాజీ, పశ్చిమ మహిళా అధ్యక్షురాలు దాసరి జ్యోతి, పఠాన్ అస్మా, మల్లె విజయ, చంద్ర శేఖర్ తదితరులు మాట్లాడుతూ టిడిపి నుంచి గెలిచిన మద్దాలిగిరి వైసిపిలోకి ఎలా వెళ్లారని ప్రశ్నించారు. గిరికి ధైర్యముంటే రాజీనామా చేసి మళ్ళీ గెలవాలని, టిడిపి గుర్తు పై గెలిచి వైసిపికి అమ్ముడుపోయిన వ్యక్తి చంద్రబాబు నాయుడ్ని విమర్శిస్తారా అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ప్రశ్నించిన తమ పార్టీ నాయకులు కోవెలమూడి రవీంద్రపై వైసిపి కార్పొరేటర్ల ద్వారా విమర్శలు చేయించడం తగదన్నారు. కార్పొరేటర్లు నగర అభివృద్ధి మానుకొని చిల్లర రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. గుంటూరు నగరంలో అధ్వానంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థతో ప్రజలు ఎంతో ఇబ్బంది పడ్తున్నారని సమస్యలు పట్టించుకోవాలని వైసిపి కార్పొరేటర్లకు హితవు పలికారు.

ఆర్‌యుబిల నిర్మాణానికి సత్వర చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్‌ఓబిలు, ఆర్‌యుబిల నిర్మాణాలకు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ సత్వర చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో గుంటూరు రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కో ఆర్డినేషన్ జెవి అనూష, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ నిర్మల, అడిషనల్ ఎస్‌పి శ్రీనివాసరావు, సిఆర్‌డిఎ ఈఈ శ్రీనివాస్, జిఎంసి ఎస్‌ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఇతర అధికారులతో గుంటూరులో చేపట్టాల్సిన శంకర్‌విలాస్, శ్యామలానగర్ ఆర్‌ఓబి, ఆర్‌యుబిల నిర్మాణం, ఇతర అంశాలపై సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రోజు రోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా చేపట్టిన రోడ్ల విస్తరణతోపాటు, రైల్వేలైన్ల వద్ద ఆర్.ఓ.బి.లుగానీ ఆర్‌యుబిల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రానికి సేతుబంధు పథకంలో శంకర్ విలాస్ ఆర్‌ఓబి., శ్యామల నగర్ ఆర్‌యుబిల నిర్మాణం చేయాలని ప్రతిపాదనలు పంపామన్నారు. నెహ్రూ నగర్, సంజీవయ్య నగర్, గడ్డిపాడు వద్ద వచ్చే వారంలో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు సంయుక్త పర్యటనలు చేసి ట్రాఫిక్ ఫీజిబులిటి, స్థల సేకరణ, డ్రైనేజి తదితర అంశాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. నగరంలో డ్రైనేజి వెళ్ళే మొండిగేటు అవుట్ ఫాల్‌డ్రైన్‌కు కుడా రైల్వే నుండి త్వరలో సమగ్ర అనుమతులు వస్తాయన్నారు. ఆర్‌ఓబిలు, ఆర్‌యుబిల నిర్మాణానికి డిపిఆర్‌ను జిఎంసి చేపడుతుందన్నారు. గుంటూరు రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కో ఆర్డినేషన్ జెవి అనూష మాట్లాడుతూ తమ శాఖ నుండి ఆర్.ఓ.బి., ఆర్.యు.బి.లకు సంబందించి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో రైల్వే డిప్యూటీ సిఈ గజశక్తి నోయల్, డివిజనల్ ఇంజినీర్ సుదర్శనరెడ్డి, జిఎంసి ఇఇలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్



సదస్సుకు హాజరైన టిసిఎస్ ప్రతినిధులు

మలినేనిలో టిసిఎస్ అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య ఇంజినీరింగ్ కాలేజిలో టిసిఎస్ మైక్రోసాఫ్ట్ బిజినెస్ యూనిట్ వారితో ంబతీ-బబం కార్యక్రమం ప్రారంబించారు. ఈ కార్యక్రమం టిసిఎస్ హైదరాబాద్ రీజనల్ హెడ్ రిచర్డ్‌కింగ్ చాత్రగడ్డ, అసిస్టెంట్ కన్సల్‌టెంట్ రవికుమార్ కొల్లూరు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిచర్డ్ కింగ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో అత్యధిక వేతనం కలిగిన ఉద్యోగాలు సాధించాలంటే అజార్, క్లౌడ్ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సర్టిఫికెట్ కోర్సులు చేయాలని సూచించారు. వాటికి సంబంధించిన శిక్షణా తరగతులను ఈ కార్యక్రమం ద్వారా నేర్పించటం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ హెడ్ డాక్టర్ కె.శ్వేత, కళాశాల డైరెక్టర్లు డాక్టర్ దేవిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ పాటిబండ్ల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భీమిరెడ్డి సాంబిరెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిపిఎం సీనియర్ నాయకులు, రైతాంగ ఉద్యమ నేత భీమిరెడ్డి సాంబి రెడ్డి ఐదవ వర్ధంతి సభ మంగళగిరి మండలం కాజా సుందరయ్య భవన్లో బుధవారం సిపిఎం మండల నాయకులు ఉద్దంటి దుర్గారావు అధ్యక్షతన నిర్వహించారు. సభలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారవు మాట్లాడుతు సాంబిరెడ్డి జీవితాంతం విలువలకు కట్టుబడి పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. కుల మతాల కతీతంగా అందరూ సమానంగా ఉండాలని కార్యకర్తలకు బోధిస్తూ ఉండేవారిని తెలిపారు. మంగళగిరి ప్రాంతంలో అనేక గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే దాన్లో అగ్రభాగాన్ని నిలబడ్డారని తెలిపారు. నేటి యువత ఆయన క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని కోరారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని వీటికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించటమే సాంబి రెడ్డి కి ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యలపై నిరంతరం సాంబిరెడ్డి కృషి చేశారన్నారు. ఎంటిఎంసి పరిధిలో ఉన్న విలీన గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని కనీస వేతనాలు ఎక్కడ అమలు జరగడం లేదని వీరి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై నేతాజీ, ఎం రవి, నాయకులు బి కోటేశ్వరి, పకీరయ్య, జెట్టి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాశం రామరావు



575 మార్కులు సాధిస్తే ఇంటర్‌లో ఫ్రీ సీటు

ప్రజాశక్తి - వినుకొండ

పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న శావల్యాపురం జెడ్‌పి పాఠశాల విద్యార్థులకు వినుకొండలోని విశ్వసాయి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని బుధవారం అందించారు. 87 మంది వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమానికి పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బి.భువనేశ్వరి దేవి, అధ్యక్షత వహించగా కాలేజీ కరస్పాండెంట్ యడవల్లి శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థుల చదువుకు పేదరికం అవరోధం కాకూడదని చెప్పారు. పదోతరగతిలో 575 మార్కులు దాటిన విద్యార్థులకు తమ కాలేజీలో ఉచితంగా ఇంటర్‌ను చదివిస్తామని, 550కుపైగా మార్కులను సాధిస్తే ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బివి.నాగేశ్వరరావు, పిడిఆర్ రాధాకృష్ణమూర్తి, హనుమంతరావు, నిర్మలకుమారి, అభి, సువర్చలాదేవి, ప్రశాంతకుమారి, కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య టెక్నో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వినుకొండ

ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన మ్యాథ్స ఒలింపియాడ్‌లో స్థానిక శ్రీచైతన్య టెక్నో పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ప్రథమ, తృతీయ స్థానాలు సాధించి 26 బంగారు బతకాలు, 4 ప్రత్యేక బహుమతులు, 32 కన్సోలేషన్ బహుమతులు, 65 మెరిట్ పత్రాలు, మొత్తంగా 129 బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవరం అభినందన సభ నిర్వహించగా ప్రిన్సిపల్ ఆదినారాయణ మాట్లాడారు. పట్టణంలో మరెవరూ ఇంతటి ఉత్తమ ఫలితాలను సాధించ లేదని చెప్పారు. కేవలం పాఠ్య పుస్తకాలను మాత్రమే కాకుండా అదనంగా అనేక అంశాలలో విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని, బంగారు భవిష్యత్తుకు అవసరమైన జ్ఞానాన్ని విద్యార్థి దశ నుండే అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏజీఎం అంజయ్య, ఆర్ఐ సురేంద్ర, కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్ రవీంద్ర, ఏవో సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లపల్లిలో గ్రామోదయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా మాచర్ల మండలం తాళ్లపల్లిలో ఎంపిడిఒ కోటేశ్వరరావు బుధవారం ఉదయం పర్యటించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని తనిఖీ చేసి క్లాప్ మిత్రలతో మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కెజిబివిలో తహశీల్దార్ బస

ప్రజాశక్తి- నూజెండ్ల

మండల కేంద్రమైన నూజండ్లలోని కెజిబివి పాఠశాలలో తహశీల్దార్ జె.మధుబాబు మంగళవారం రాత్రి బస చేశారు. పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. భోజనం, పరిశుభ్రత, ఇతర వసతులపై తనిఖీ చేశారు. సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి ఏతవాలని ప్రిన్సిపాల్ ఉషారాణికి చెప్పారు.

తక్కువ ఖర్చుతోనే పౌష్టికాహారం..



వినుకొండలో పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - వినుకొండ

గర్భిణులు ఎక్కువమంది రక్తహీనతతో బాధపడుతున్నారని, దీని నివారణ కోసం ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తోందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీలత తెలిపారు. మండలంలోని ఏనుగుపాలెం సెక్టార్ పరిధిలోని నాగిరెడ్డిపల్లి ఒకటో నంబర్ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు బుధవారం నిర్వహించారు. 34 కేంద్రాల అంగన్వాడీలు పాల్గొని పోషకాలతో కూడిన వివిధ రకాల పిండివంటలు ప్రదర్శించారు. రక్తహీతన, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఏనుగుపాలెం పిహెచ్‌సి వైద్యులు రాము నాయక్, సూపర్‌వైజర్ శ్రీలత వివరించారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు విధిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు కోమలిదేవి, ఏసు మాణిక్యం, హారతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల : బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలనీ ముప్పాళ్ల సెక్టార్ అంగన్వాడీ సూపర్‌వైజర్ ఎమ్.జీవనజ్యోతి అన్నారు. మండల కేంద్రమైన ముప్పాళ్లలో బుధవారం నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందించే ఆహారానికి అదనంగా ఇంట్లో పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ఇవ్వాలని, చిరుధాన్యాల వాడకం ద్వారా పిల్లలు త్వరగా ఎదుగుతారనని చెప్పారు. ఎత్తు తక్కువ పిల్లలకు వ్యాయామం చేయించాలన్నారు.

ప్రజాశక్తి-నాదెండ్ల : మండలంలోని గురిజవోలులో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో పోషక విలువలు ఉండే పదార్థాలను తయారు చేసుకునే విధానాన్ని వివరించారు. ఇందులో భాగంగా అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేకంగా స్టాల్‌ను ఏర్పాటు చేసి పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సూపర్‌వైర్ పద్మ, కె.వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి, అంగన్వాడీలు శ్రీలక్ష్మి, విమల, యామిని, ఖాదర్‌బి, రమాదేవి పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి - నూజెండ్ల



బాల్య వివాహాలపై నూజెండ్ల మండలం ఉప్పలపాడులో..

బాలలకు వివాహాలు చేయడం చట్ట పరంగా నేరంతోపాటు వారి ఆరోగ్యానికీ ముప్పని ఉప్పలపాడు అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వరమ్మ అన్నారు. బాల్య వివాహాలు - నియంత్రణపై పాఠశాలలో బుధవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్యంలో వివాహాలు చేయటం వలన అనేక ఇబ్బందులు, అనారోగ్య పరిస్థితులు వస్తాయన్నారు. దీనిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఎఎన్‌ఎం చందోలు నాగమణి మాట్లాడుతూ మైనర్ వివాహాల వలన మానసికంగా శారీరకంగా కంగిపోవటమే కాకుండా పుట్టబోయే బిడ్డలు అనారోగ్యంతో జన్మిస్తారని అన్నారు. సమాజంలో స్థిరపడకక ఆర్థిక సామాజిక కుటుంబ కష్టాలను చవిచూడాల్సి ఉంటుందని వివరించారు. బాలికలు విద్యతోనే సంపూర్ణ వికాసం పొందుతున్నారని, సామాజిక దురాచారాల పట్ల మహిళలకు బాలికలకు చైతన్య సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు.

దళితులపై దాడులు జరిగినా కేసులు పెట్టాం

- జగన్‌ను వదిలిన వెళ్లే వారికి రాజకీయంగా అవే ఆఖరి రోజులు
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున



విలేకర్లతో మాట్లాడుతున్న మేరుగ నాగార్జున

ప్రజాశక్తి - వినుకొండ

దళితులపై కొన్నిచోట్ల దాడులు జరిగినా కేసులు పెట్టామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. వినుకొండలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం వచ్చిన ఆయన స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. టిడిపి పాలనలో దళితులపై అనేక దాడులు జరిగితే చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోకుండా అన్యాయం చేశారన్నారు. దళితుల సంక్షేమానికి గత ప్రభుత్వం రూ.36 వేల కోట్లు ఖర్చు చేస్తే తమ ప్రభుత్వం రూ.56 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. 40 మంది వైసిపి ఎమ్మెల్యేలు తమకు టచ్‌లో ఉన్నారంటూ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు అంటున్నారని, జగన్మోహన్‌రెడ్డి దగ్గర నుంచి వెళ్లిన వారికి రాజకీయాల్లో అవే చివరి రోజులని వ్యాఖ్యానించారు. నాడు-నేడు పథకం ద్వారా సంక్షేమ హాస్టళ్లలో వసతులు మెరుగుపరుస్తు న్నామని, రెసిడెన్షియల్ స్కూల్ అభివృద్ధికి త్వరలో పనులు చేపడతామని చెప్పారు. టిడిపి హయాంలో మూసివేసిన హాస్టల్స్‌ను పునరుద్ధరిస్తున్నామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చిన్నబ్బాయి, కౌన్సిలర్ షకీలా, జి.పాలిరెడ్డి పాల్గొన్నారు.



అనర్హత వేటుపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి - మాచర్ల : రాహుల్‌గాంధీపై అనర్హతను రద్దు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ వై.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం నిరసన తెలిపారు. డాక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అదానీ వ్యవహారంపై పదేపదే ప్రశ్నిస్తుండడంతో ప్రధాని మోడీకి, బిజెపికి నిద్ర పట్టడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు టి.శ్రీనివాసరావు, సిహెచ్.వెంకటేశ్వర్లు, జివి సత్యనారాయణ, వి.నాగరాజు, బి.శ్రీనివాసరావు, రఫీ, స్వామి పాల్గొన్నారు.

'కోనసీమ అల్లర్ల కేసు ఉపసంహరణ అవకాశవాదమే'

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్ : రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన, శాంతిభద్రతలకు విఘాతం కలించిన కోనసీమ అల్లర్ల కేసును ఉపసంహరించుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం పకటించటం దారుణమని జై భీం భారత్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ జొన్నలగడ్డ విజయ్‌కుమార్ ఖండించారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ చర్య అవకాశవాద రాజకీయాలకు అద్దం పడుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు ఎం.సుధాకర్‌రావు, ఎం.దేవరాజ్, జె.కమల్ కుమార్ పాల్గొన్నారు.

ఓట్లను తొలగిస్తున్నారని ఫిర్యాదు

ప్రజాశక్తి- నూజెండ్ల : అర్హులైనప్పటికీ టిడిపి సానుభూతిపరులైన కారణంగా కొందర్ని లక్ష్యంగా చేసుకుని వైసిపి నాయకులు ఫారం-7తో దరఖాస్తు చేశారని, దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. అర్హుల ఓట్లను తొలగిస్తే న్యాయపోరాటం చేస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వై.వెంకట్రావు, జి.బ్రహ్మయ్య ఉన్నారు.

సెలవు రోజైనా విద్యుత్ బిల్లు చెల్లించొచ్చు

ప్రజాశక్తి-చిలకలూరిపేట : శ్రీరామ నవమి సందర్భంగా గురువారం సెలవు రోజే అయినా స్థానిక వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి విద్యుత్ బిల్లులు కట్టించుకుంటారని డిఇఇ ఆర్.అశోక్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవాలు



సీనియర్ నాయకులను సత్కరిస్తున్న వైవి ఆంజనేయులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా విలేకర్లు

తెలుగుజాతి ఆత్మగౌరవ నినాదంతో నందమూరి తారకరామారావు స్థాపించిన పార్టీ ఆయన ఆశయాలకు అనుగుణంగా చంద్రబాబునాయుడు సారథ్యంలో పేదలకు అండగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు అన్నారు. టిడిపి ఆవిర్భవించి 41 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించాయి. టిడిపి జెండాలను ఆవిష్కరించడంతోపాటు ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఉప్పాళ్లలో టిడిపి మండల అధ్యక్షులు బి.నాగేశ్వరరావు అధ్యక్షతన కేక్‌ను కట్ చేశారు. వైవి ఆంజనేలయు మాట్లాడుతూ టిడిపిని ఎన్‌టిఆర్ స్థాపించి 9 నెలల్లో అధికారంలోకి తెచ్చారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని మళ్లీ గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. నాయకులు చంద్రశేఖర్, యల్లమంద, నరేంద్ర, అన్వర్, అబ్దుల్ మజీద్, వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మయ్య, దేవేంద్రరావు, శ్రీను, నానయ్య పాల్గొన్నారు. బెల్లంకండ మండలం చంద్రాజుపాలెంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉత్సవాలు చేశారు. నూజెండ్లలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాచర్లలో టిడిపి పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహనికి పూలమాలలు వేసి, జెండాను ఆవిష్కరించారు. పెదకూరపాడులో కేచ్‌ను కట్ చేశారు. కారంపూడిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి జెండాను ఎగురవేశారు. కేక్ కట్ చేసి పులిహార పంపిణీ చేశారు. టిడిపి శ్రేణులకు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు చిలకలూరిపేటలోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. పార్టీని అధికారంలోకి తేవడానికి రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు.

తొలగించిన సెక్యూరిటీ గార్డ్స్‌ను పనిలోకి తీసుకోండి

ప్రజాశక్తి-మంగళగిరి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల కారణంగానే మంగళగిరి ఎయిమ్స్ లో సెక్యూరిటీ గార్డ్స్ ను తొలగించడం జరిగిందని సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. ఎయిమ్స్‌లో తొలగించిన 71 మంది సెక్యూరిటీ గార్డ్స్ ను తిరిగి పనిలోకి తీసుకోవాలని కోరుతూ ఎయిమ్స్ సెక్యూరిటీ అసోసియేషన్, సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎయిమ్స్ గేటు వద్ద జరుగుతున్న రిలే నిరా హార దీక్షలు బుధవారం నాటికి మూడో రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని నేతాజీ ప్రారంభించి మాట్లాడుతూ నాలుగేళ్లుగా పని చేస్తున్న సెక్యూరిటీగార్డ్స్‌ను ఎందుకు తొలగించారో తెలియజెప్పే జీవో ను అధికారులు తమకు చూపించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు అరికట్టే పరి స్థితు ల్లో కేంద్ర ప్రభుత్వం లేదని విమర్శించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ సమస్యపై జోక్యం చేసుకోవాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఈ సమస్య గురించి పట్టించుకోవడంలేదని విమర్శించారు. పని లోకి తీసుకునే అంతవరకు పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. దీక్షలో పి. వెంకటేశ్వరరావు, కెవిఎస్ కిరణ్, బి వి ఎల్ నారాయణ, ఎస్ దేవయ్య, జి ఆరోను పాల్గొన్నారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, సిఐటియు నాయకులు టి శ్రీనివాసరావు, షేక్ జానీ బాషా దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. సెక్యూరిటీ అసోసియేషన్ నాయకులు జి కోటేశ్వరరావు, పి శివశంకర్, పి సాంబశివరావు, ఆర్ రంగారావు, యు వెంకటేశ్వరావు,కె.బుజ్జిబాబు, కె. వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్ష వద్ద మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్య దర్శి వై.నేతాజీ

ఎయిమ్స్ గేటు వద్ద ఎయిమ్స్ సెక్యూరిటీ అసోసియేషన్ కమిటీ, సిఐ టియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని బుధవారం సాయంత్రం సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు సందర్శించి మద్దతు తెలిపారు. ఎయిమ్స్‌లో ఉన్న కార్మి కులను, సిబ్బందిని సంఘటిత పరిచి రానున్న కాలంలో ఉద్య మాన్ని బలోపేతం చేసేలా ఈ ఉద్యమం ఉండాలని ఆయన అన్నారు.

స్విమ్మింగ్ ఫూల్, స్కేటింగ్ ట్రాక్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-మంగళగిరి



నగర పరిధిలోని గుంటూరు ఛానల్ వెంబడి రక్షిత మంచి నీటి పథకం ఆవరణలో నిర్మిస్తున్న స్విమ్మింగ్ ఫూల్, స్కేటింగ్ ట్రాక్ నిర్మాణ పనులను త్వరి తగతిన పూర్తి చేసి ఏప్రిల్ 15వ తేదీ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. బుధవారం ఎమ్మెల్యే ఆర్కే నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ లతో కలిసి స్విమ్మింగ్ ఫూల్, స్కేటింగ్ ట్రాక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయా నిర్మాణ పనులను వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మహిళలకు, యువ తకు ప్రత్యేక వసతులతో పాటు ప్రత్యేక సమయాలు కేటా యించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

చేనేత మగ్గం షెడ్ల నిర్మాణాల పరిశీలన.

నగరంలోని రాజీవ్ గృహకల్ప ఆవరణలో రూ.2 కోట్ల తో నిర్మాణం చేపట్టిన చేనేత మగ్గం షెడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. మగ్గం షెడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులైన కార్మికులకు కేటాయించేలా చర్యలు తీసు కోవాలని అధికారులకు సూచించారు. అనంతరం అదే ప్రాం తంలోని నిర్మాణం జరుపుకుంటున్న రజక కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను ఆయన పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేసి అందు బాటులోకి తీసుకురావాలని అన్నారు.

రేపు మందడంలో సభకు తరలిరండి

ప్రజాశక్తి-మంగళగిరి

అమరావతి రాజధాని కొనసాగించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటం ఈనెల 31 తేదీకి 1200 రోజులు పూర్తవుతుందని, ఈ సందర్భంగా మండలంలో 31వ తేదీన సభ నిర్వహిస్తున్నట్లుగా సిపిఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ బుధవారం మంగళగిరి సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలిపారు.మంగళగిరి సిపిఐ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి వెళతామని తెలిపారు. సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నియోజవర్గ నాయకులు కంచర్ల కాసియా, జాలాది జాన్ బాబు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి



మంగళగిరి నియోజకవర్గంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి 'స్త్రీ శక్తి' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎంఎస్ఎస్ భవన్ లో 8వ బ్యాచ్ నందు శిక్షణ పొందిన 35 మంది మహి ళలకు కుట్టుమిషన్లను తెలుగు మహిళ విభాగం అధ్వర్యంలో అందజేశారు. 60 రోజుల పాటు టైలరింగ్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

పదో తరగతి పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

సిపిఎం నాయకులు వీసం నాగేశ్వరావు జ్ఞాపకార్థం వీసం నాగేశ్వరావు, జయప్రద వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి నిర్మల జూనియర్ కళాశాల ఆవరణలో 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు ఎగ్జామినేషన్ ప్యాడ్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్మల జూనియర్ కళాశాల, దాని అనుబంధ సంస్థల అధినేత వివి ప్రసాద్ మాట్లాడుతూ ఏప్రిల్ మూడో తేదీ నుండి పదవ తరగతి విద్యార్థుల పరీక్షలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. మంగళగిరి పరిసర ప్రాంత ప్రజల పేద విద్యార్థిని విద్యార్థులకు సేవా కార్యక్రమాలు చేయాలని సంకల్పించినట్లుగా తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు వి వెంకటేశ్వరరావు, నలంద ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి శ్రీనివాసరావు, విష్ణు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి మనోజ్ కుమార్, సిపిఎం పట్టణ నాయకులు వివి జవహర్లాల్, కే జ్యోతి పాల్ తదితరులు పాల్గొన్నారు. 50 వేల రూపాయలు విలువ చేసే ప్యాడ్స్ ను పంపిణీ చేశారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా విలేకరులు

తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ కార్యాలయాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. తుళ్లూరు, రాయపూడి తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. రాయపూడిలో టిడిపి గ్రామ అధ్యక్షులు మూల్పూరి శ్రీనివాసరావు,మండల ఉపాధ్యక్షులు సాహెబ్ జాన్ టిడిపి జెండా ఎగుర వేశారు.టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో నాయ


తాడేపల్లిలో..

కులు చిలకా బసవయ్య,మాబు సుభాని(కోకిల) తదితరులు పాల్గొన్నారు. టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధ తాడే పల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ కళామందిరం వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ టిడిపితోనే సామాజిక న్యాయం సాధ్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి సీని యర్ నాయకులు జంగాల సాంబశివరావు, మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ఎం.సత్యనారా యణ, డి.దాసు, ఇట్టా భాస్కర్, బి.రామకృష్ణ, ఎ.మురళీ, కిరణ్ పాల్గొన్నారు. ఉండవల్లిలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జెండాను ఎస్‌సి సెల్ నాయ కులు డి.జ్యోతిబసు ఆవిష్కరించారు.

ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లి రూరల్ గ్రామాల్లో, కుంచనపల్లిలోని తెలుగుదేశం తాడేపల్లి మండల కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు పూల మాలవేసి నివాళులర్పించారు. వడ్డేశ్వరంలో తెలుగు దేశం గ్రామ అధ్యక్షులు ఈ పూరి కోటయ్య అధ్యక్షతన


తుళ్లూరులో..

వేడుకలు జరిగాయి. గుండిమెడలో తెలుగుదేశం గ్రామ అధ్యక్షులు చిగురుపాటి సుబ్బా రావు అధ్యక్షతన బుధవారం ఘనంగా జరిగింది. ఎన్టీఆర్ చిత్రపటానికి తెలుగు దేశం తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం తాడేపల్లి మండల ఉపాధ్యక్షులు గుండి మెడ రమేష్ బాబు, తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో రాష్ట్ర రైతు కొ ఆర్డి నేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. పొన్నూరులోని టిడిపి కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. నందమూరి తారకరామా రావు, ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఐలాండ్ సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పాత పొన్నూరు మూర్తి మహల్ సెంటర్‌లో టిడిపి నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. పెదనందిపాడులో, మండలంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. పెదనంది పాడులో పార్టీ నాయకులు రావి శివరామకృష్ణయ్య ఎన్టీఆర్ గురించి ప్రసంగించారు. వరగానిలో పార్టీ అధ్యక్షులు చెన్నుపాటి సురేంద్ర జెండా ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మంగళగిరి నియోజకవర్గం టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండల కేంద్రం దుగ్గిరాలలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు .ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఆసరా చెక్కుల పంపిణి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

డ్వాక్రా మహిళలకు నిధులు సమకూర్చే అంశాన్ని ప్రభుత్వం చూసుకుంటుందని ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన హామీలను టిడిపి ప్రభుత్వం తుంగలో తొక్కిందని గుర్తు చేశారు. పట్టణ, గ్రామీణ మహిళలకు తోడుగా ఉంటానని ఎమ్మెల్యే శివకుమార్ హామీ ఇచ్చారు. పట్టణ 10వ వార్డు సచివాలయంలో మూడవ విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పట్టణ 5వ వార్డు నుండి 12 వార్డుల్లో కలిపి 2065 డ్వాక్రా సభ్యులకు రూ 1.75 కోట్ల రూపాయల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ ఖాలేద నసీమ్, మున్సిపల్ కమీషనర్ ఎం జస్వంతరావు, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పట్టణ కౌన్సిలర్లు, పలువురు ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - చేబ్రోలు

మండలం కేంద్రమైన చేబ్రోలులో వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యేకిలారి వెంకట రోశయ్య పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అమలు చేస్తున్న పథకాలు రాష్ట్రంలో ఉన్న ప్రతి కుటుంబం లబ్ధి పొందు తోందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.సాహితీకిరణ్, బాబు రావు, జడ్పీటీసీ సభ్యులు బత్తుల అనూరాధ, ఎపియం నాగేశ్వరరావు, చేబ్రోలు సర్పంచ్ పి.వినితా రాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

సీనియర్ నాయకుడు, గొల్లమూడి పాడు మాజీ సర్పంచ్ రామినేని వెంకయ్య చౌదరికి ఎమ్మెల్యే కె.రోశయ్య బుధవారం నివాళులర్పించారు. గొల్లమూడి పాడు గ్రామంలోని ఆయన స్వగృహానికి ఎమ్మెల్యే వెళ్లి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

12న కెఎల్ యులో ఒక రోజు వర్క్‌షాపు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

మానసిక సంతోషం మనిషి మనుగడకు ముఖ్యమని కెఎల్ విశ్వవిద్యాలయం ఛైర్మన్, చాన్సులర్ కోనేరు సత్యనారాయణ అన్నారు. ఈ లక్ష్యం దిశగా కెఎల్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ బ్రెయిన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ , తమన ఫౌండేషన్ లు సంయుక్తంగా నూతన నైపుణ్యావృద్ధి ప్రయోగశాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మానసిక అనారోగ్యం శాపం కాదని, దానిని సరైన సమయంలో గుర్తించి వైద్య సహాయం అందిస్తే మళ్లీ దైనందిన కార్యక్రమాలలో చురుకుగా ఉంటారని కెఎల్ విశ్వవిద్యాలయం ప్రో చాన్సులర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 12న వడ్డేశ్వరంలోని కెఎల్ విశ్వ విద్యాలయం న్యూ సెమినార్ హాల్‌లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 వరకు ఒక రోజు అవగాహన వర్క్ షాప్ ను నిర్వహించనున్నట్లు తెలిపారు.ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 9989545567, 8466011222, 94942 39560 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అట్టహాసంగా పల్నాడు జిల్లా ప్రథమ వార్షికోత్సవాలు

ప్రజాశక్తి-నరసరావుపేట

వచ్చే నెల 4 న పల్నాడు జిల్లా ఏర్పడి మొదటి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రథమ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వేడుకలకు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, గ్రామ సర్పంచ్ సచివాలయ సిబ్బంది దగ్గర నుండి మండల జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. జిల్లాలో ఈ ఏడాది కాలంలో సాధించిన ప్రగతిని మరియు ప్రజలు ఏరకంగా సేవలు ఉపయోగించుకున్నారో ఈ ప్రథమ వార్షికోత్సవం ద్వారా తెలియపరుస్తామన్నారు. పల్నాడు జిల్లా సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడేలా స్వాగత ద్వారం నిర్మించి గేటు, పైలాన్, క్యాంటీన్, పార్కింగ్‌కు కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే ప్రజలకు స్థలం, స్త్రీ పురుషులకు వేరు వేరుగా వ్యక్తిగత మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా అభివృద్ధి పనులను కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ ట్రోఫీ పేరుతో నిర్వహించనున్న ఆటల పోటీలను ప్రజా ప్రతినిధులు ప్రారంభిస్తారన్నారు. ఆయా ఆటల పోటీలకు సంబంధించి ఎంపికలు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలు విజయవంతం చేయాలన్నారు.

వడ్డీ రాయితీకి రెండ్రోజులే గడువు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీకి 31వ తేదీ వరకే గడువు ఉన్నందున పన్ను చెల్లింపుదార్లకు వీలుగా గురువారం శ్రీరామనవమి సెలవు రోజు అయినప్పటికీ జిఎంసి క్యాష్ కౌంటర్లు యధావిధిగా పని చేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయి అంతా ఏక మొత్తంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ప్రకటించిందని, కావున ఈ నెలాఖరులోపు తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితి పొందాలని కోరారు. 31న పన్ను చెల్లింపునకు ఏక కాలంలో ఎక్కువ మంది వస్తే సర్వర్ సమస్య ఏర్పడే అవకాశం ఉన్నందున ముందుగానే పన్ను చెల్లించాలన్నారు. జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంతో పాటు, భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్డులోని148 వార్డు సచివాలయాల్లో కూడా క్యాష్ కౌంటర్లు ఉదయం 8 నుండి సాయంత్రం 8 గంటల వరకు పనిచేస్తాయన్నారు. కావున జిఎంసికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఏప్రిల్ 1 నుండి పన్నుతో కలిపి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏప్రిల్ 1నుండి పన్ను బకాయిదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఆర్.ఐ.ల వారీగా యాక్షన్ సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామని ఆ ప్రకటనలో తెలిపారు.



ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న మహిళలు

రేపటి నుండి యడ్లపాడులో జాతీయ స్థాయి నాటిక పోటీలు

ప్రజాశక్తి - యడ్లపాడు : పుచ్చలపల్లి సుందరయ్య 20వ జాతీయస్థాయి తెలుగు సాంఘీక నాటికల పోటీలు ఈనెల 31వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. పల్నాడు (ఉమ్మడి గుంటూరు) లోని యడ్లపాడు గ్రామంలో గత రెండు దశాబ్దాలుగా ఈ పోటీలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. గతేడాది నుంచి జాతీయస్థాయి పోటీల నిర్వహణకు నిర్వాహక కమిటీ సభ్యులు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని కళా సంస్థల్లోనే భిన్నంగా ఈ పోటీలను నిర్వహిస్తూ అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ ఏడాది మార్చి 31వ తేదీ, ఏప్రిల్ 1,2వ తేదీల్లో మూడు రోజులు పాటు పండుగ వాతావారణంలో కొనసాగే ఈ పోటీలు విజయవంతం చేయాలని కమిటీ నిర్వాహకులు ముత్తవరపు సురేష్‌బాబు, పద్మారావు, నూతలపాటి కాళిదాసు, జరుగుల శంకరరావు బుధవారం తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్వాహక కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రాలను యడ్లపాడు గ్రామంలో పంపిణీ చేశారు. ఆహ్వాన పత్రంతో పాటు లక్కీడ్రా కూపన్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నాటికల పోటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎన్నో వ్యవప్రయాసాలకు ఓర్చి నాటకరంగం అభివద్ధి కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. కళాభిమానులు అధిక సంఖ్యలో హాజరై ప్రదర్శనలను తిలకించి విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 'కైజెన్-2కే23'

ప్రజాశక్తి-గుంటూరు :వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్ 'కైజెన్ 2కె23' వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగాలని, తద్వారా పది మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులందరూ ఎప్పుడూ ఒకే విధంగా మూసధోరణిలో పనులు చేసుకుంటూ వెళితే కొన్నాళ్లకే బోరు కొడుతుందన్నారు. మీ పరిధిని దాటి సులువైన పద్ధతుల కోసం ఆలోచనలు చేయాలన్నారు. చేసే పనులను కాస్త కొత్తగా, సజనాత్మకంగా చేయడానికి ప్రయత్నిస్తే విజయం మీ సొంతమవుతుందని చెప్పారు. సాధించాల్సిన లక్ష్యాల గురించి వివిధ రకాలుగా ఆలోచించి తగిన ప్రణాళికలు వేసుకోవాలన్నారు. కైజెన్- 2కె23ని పురస్కరించుకుని నిర్వహించిన పలు పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న అధ్యాపకులు

ఎల్ఐసి ఆఫీసు వద్ద పెన్షనర్ల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

పెన్షన్ స్థిరీకరణ, కుటుంబ పెన్షన్ పెంపుదల, నూతన పెన్షన్ స్కీమ్ రద్దు, పాత పెన్షన్ స్కీమ్ అమలు డిమాండ్లను వెంటనే ఆమోదించాలని కోరుతూ బుధవారం మధ్యాహ్నం అరండల్‌పేటలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద ప్రదర్శన నిర్వహించారు. న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన జాతీయ స్థాయి ధర్నాకు సంఘీభావంగా ఎన్.బంగారుబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ కార్యదర్శి కె.ఎల్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకోసారి ఉద్యోగులకు జరిగే వేతన సవరణ మాదిరిగా పెన్షనర్లకు కూడా పెన్షన్ స్థిరీకరించాలన్నారు. ఫ్యామిలీ పెన్షన్‌ను 30 శాతం పెంచుతూ మేనేజ్‌మెంట్ పంపిన ఫైలును కేంద్ర ఆర్థిక శాఖ వెంటనే ఆమోదించాలని, ఎల్ఐసిలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. ఎల్ఐసిని బలహీన పరిచే విధానాలు విడనాడాలని విజ్ఞప్తి చేశారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వి.వి.కె.సురేష్ పెన్షనర్లకు సంఘీబావం తెలియజేశారు. కార్యక్రమంలో టి.జనార్ధనరావు, బివిఎస్ హనుమంతరావు, టి.సాయిబాబు, టి.సంపత్‌కుమార్, కె.సీతా రమేష్, సిహెచ్.అన్నామణి, టి.సరోజిని, కె.స్వరూపరాణి, సిహెచ్.వెంకట్రావు పాల్గొన్నారు.



గుంటూరులో ఎల్ఐసి కార్యాలయం వద్ద నిరసనలో పాల్గొన్న పెన్షనర్లు

పల్నాడులో డొంక రోడ్లకు మహర్దశ

ఎంపి శ్రీకష్ణదేవరాయలు చొరవ, సాయంతో పనులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు జిల్లాలోని పలు గ్రామాల్లో పొలాలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశాన్ని పలు గ్రామాల రైతులు ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే తన వంతు సహకారం అందిస్తున్నారు. గడిచిన 4 నెలల కాలంలో దాదాపు 20 గ్రామాల్లో రోడ్లని ఆయా గ్రామాల ప్రజలు, రైతుల సహకారంతో బాగుచేయించారు. మరికొన్ని గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి పనులు ఇప్పటికే జరుగుతున్నాయి. మిషనరీని సమకూర్చటంతో పాటుగా గ్రామస్తుల సహకారంతో రోడ్లు అభివృద్ధి చేస్తున్నారు. పొలాలకు వెళ్లే రోడ్లను అభివృద్ధి చేయడానికి అవసరమైన రోలర్లు, టిప్పర్లు, క్రెన్లు (జెసిబి) తదితర మిషనరీ వ్యవస్థను ఎంపి సమకూరుస్తున్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న గ్రావెల్‌ను సేకరిస్తున్నారు. వీటితో పాటుగా గ్రామస్తులు, రైతులు ఇంధన ఖర్చులు భరిస్తున్నారు. ఈ విధానంలో రోడ్ల రూపురేఖలు మారుస్తున్నారు. రోడ్ల అభివృద్ధిలో ఒక్కో కిలో మీటర్‌కు అంచనా ఖర్చు రూ.3 లక్షలవుతుంది.



వీలైనన్ని గ్రామాల్లో పొలాలకు వెళ్లే రోడ్లు అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రైతులతో కలిసి కృష్ణదేవరాయులు తగిన కార్యచరణ రూపొందించారు. పెదకూరపాడు నియోజకవర్గంలో గ్రావెల్ తరలింపు త్వరగా జరిగే 16 గ్రామాల్లో 32 కిలోమీటర్ల వరకు పొలాల రోడ్ల అభివృద్ధి చేశారు. నకరికల్లు మండలంలో గుండ్లపల్లి, చేజర్ల 15రోడ్లను 28 కిలోమీటర్లు అభివృద్ధి చేశారు. కొన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. రాజుపాలెం మండలంలో పనులకు రంగం సిద్ధం చేశారు. మరికొన్ని గ్రామాల్లో పనులకు స్థానిక నాయకులు, రైతులతో చర్చించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఉన్నత విద్య, ఉపాధిపై హిందూ ఫార్మసీలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు



ఐర్లాండ్ దేశంలో ఔషధ రంగంలో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై బుధవారం స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. సమావేశానికి కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అధ్యక్షత వహించారు. ఐర్లాండ్ ఉన్నత విద్యాశాఖ సలహాదారు డేవిడ్ ఫల్లోన్, ఐ20 ఫీవర్ మేనేజర్, బి.శ్రీనివాసరాజు, కిషోర్‌బాబు తదితరులు ప్రసంగించారు. డేవిడ్ ఫల్లోన్ మాట్లాడుతూ ఐర్లాండ్‌లో ఫార్మసీ ఉన్నత విద్యను అందిస్తున్న యూనివర్సిటీల వివరాలు, స్పెషలైజేషన్లు, పిజి కోర్సుల్లో చేరటానికి అవసరమైన అర్హతలు, వీసా నిబంధనలు, ఫార్మా సంస్థలలోని ఉపాధి అవకాశాల గురించి వివరించారు. పి.జి. కోర్సులకు వివిధ యూనివర్సిటీలలో అమలులో ఉన్న ట్యూషన్ ఫీజు వివరాలను బి.శ్రీనివాసరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మ్.డి.డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిప్స్ విద్యార్థులకు నాగలక్ష్మి మెమోరిల్ ట్రస్ట్ ప్రోత్సాహకం

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజిలో విద్యను అభ్యసిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏటా ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేయాలని కోరుతూ వజ్జా భార్గవ నాగలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ వజ్జా రంగారావు రూ.1లక్ష నగదు కళాశాల యాజమాన్యానికి అంద చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో సైంటిస్ట్‌గా ఎదిగి, అనివార్య కారణాల తో మరణించిన తమ కుమార్తె జ్ఞాపకార్థం ప్రతిగల విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించా మన్నారు. కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర, కళాశాల కోశాధికారి రాయపాటి గోపాలకృష్ణ పాల్గొన్నారు.



చెక్కు అందచేస్తున్న రంగారావు



లీవ్‌లైఫ్ ఎడ్యుకేషన్ ప్రతినిధుల్ని అభినందిస్తున్న శ్రీకాంత్‌బాబు తదితరులు

గ్లోబల్ లీడర్స్‌గా నెక్స్‌జన్ ఇంటర్నేషనల్ విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు

అంతర్జాతీయ స్థాయి ఆధునిక విద్యా బోధనతో పాటు జాతి మూలాలను మరిచిపోని నాయకత్వ లక్షణాల ద్వారా తమ పాఠశాల విద్యార్థులను గ్లోబల్ లీడర్స్‌గా తీర్చిదిద్దుతున్నామని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె.శ్రీకాంత్ బాబు పేర్కొన్నారు.స్థానిక గోరంట్లలోని నెక్స్‌జెన్ పాఠశాలలో లివ్‌లైఫ్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఏడు అంశాలలో 'లీడర్ ఇన్ మీ' పేరుతో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ భారతదేశ ప్రతినిధి, శిక్షకులు ప్రవీణ్ మాట్లాడుతూ తమ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 150 దేశాలలో పదివేల పాఠశాలలకుపైగా లక్షలాది మంది విద్యార్థులకు శిక్షణ అందిస్తూ విద్యార్థుల్లో నైతికత విలువలతో కూడిన జీవన శైలి నేర్పటం ద్వారా విద్యార్థులు తమ మాతదేశాన్ని, సమాజాన్ని ప్రేమిస్తూనే ప్రపంచ నాయకులుగా ఎదిగేలా శిక్షణ అందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల చీఫ్ లెర్నింగ్ ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీవిద్య, డైరెక్టర్ కొలసాని శ్రీకాంత్ బాబు, జనరల్ మేనేజర్ ఆనంద్, ప్రిన్సిపల్ సుధీర్‌కష్ణన్, అరవింద తదితరులు పాల్గొన్నారు.